దివ్యజ్ఞాన తారక రాజయోగ ప్రవీణుడు

తల్లాప్రగడ సుబ్బారావు



1856 జూలై, 6 | 1890 జూన్, 24

"భారతదేశంలో యింకా మహర్షులు (Adepts) ఉన్నారనీ, చెరిగిపోని అక్షర [illegible] (Ineffable Names) యిక్కడ యింకా లుప్తమయి పోలేదనీ నా ప్రగాఢ [illegible]. భారతదేశం యింకా ఆధ్యాత్మికంగా మరుగుపడి పోలేదు. కాకపోతే [illegible] మరుగుకు దేరుకుంటూ వున్నది. ఇంకా మా దేశంలో భవసాగరాన్ని [illegible] పదాన్ని పొందిన మహనీయులు వున్నారు. వారు దురుసు వారయిన [illegible] అధికారుల బారి నుంచి, తమ ధ్యేయమే పరమార్థం అనుకునే మిషనరీల [illegible] సురక్షితంగా చీకటి గుహలలో ఉన్నారు. దట్టమయిన కీకారణ్యాలలో

'శ్రీవిరించి' (డా. యన్. సి. రామానుజాచార్యులు)

వున్నారు. వారిని సులభంగా ఎవరూ కలుసుకోలేరు. సనాతన జ్ఞానభాండాగారం (Ancient Wisdom Religion) నుంచి ఉద్భవించిన అనేక తత్త్వదర్శనాలు, సిద్ధాంతాలు, ప్రాచీన ఋషుల బోధనల సారాంశాల మేము యింకా పోగొట్టుకోలేదు. వీటిని అవగాహన చేసుకునే కీలకాలు యింకా మా దగ్గర వున్నాయి. మీరు అనుమానించ వద్దను గాని, నాకు మాత్రం దృఢంగా తెలుసును. 'కనుమరుగయి పోయిన సూత్రాలను (Lost Formulae) తిరిగి వెలుగులోనికి తీసుకురాగల కీలకమయిన కిటుకు యింకా మాకు తెలుసు. ఇది కేవలం 'దబాయింపు మాట' అని సందేహించకుని సరయిన సమయంలో నిజమయిన సత్యం వెలికివస్తుంది".

– ఈ వాక్యాలన్నీ తల్లాప్రగడ సుబ్బారావు దివ్యజ్ఞాన సమాజం (The Theosophical Society) వ్యవస్థాపకురాలు అయిన మేడమ్ బ్లావట్స్కీ (Madame Blavatsky)కి 3 ఫిబ్రవరి 1882న వ్రాసిన ఉత్తరంలో భాగాలు.

దివ్యజ్ఞాన సమాజం అనే సంస్థ 1875లో న్యూయార్క్ నగరంలో కల్నల్ హెచ్.ఎస్.ఆల్కాట్, మేడం హెచ్.పి.బ్లావట్స్కీ, డబ్లు.క్యు.జడ్జి – యింకా కొందరు తత్త్వశాస్త్ర అన్వేషకులచేత స్థాపించబడింది. ఈ సంస్థ దరిమిలా 1879లో భారతదేశానికి తరలివచ్చి, 1882లో మదరాసు రాష్ట్రంలోని అడయార్ (మదరాసు – చెన్నై) నగరంలో తన అంతర్జాతీయ కార్యస్థానాన్ని యేర్పరచుకుని యిప్పటికీ విలసిల్లుతోంది.

వ్యవస్థాపకులు అయిన ఆర్కాట్, బ్లావట్స్కీలు మదరాసు రావటానికీ, యిక్కడ అంతర్జాతీయ సంస్థ కేంద్రస్థానాన్ని నెలకొల్పుకోవడానికి కారకులు, ప్రేరకులు అయిన వారు సుబ్బారావు. ఈయన మదరాసులోని తిరువళిక్కణి (Triplicane) ప్రాంతంలో నివాసం ఉంటూ, హైకోర్టు వకీలుగా వృత్తిసాగిస్తున్న ఆంధ్రుడు. సమాజచరిత్రలో ఎన్నో విచిత్రమయిన సంఘటనలకు కారణం అయిన వ్యక్తి. ఆయనను గురించి కల్నల్ ఆర్కాట్ సమాజ అధ్యక్షుడు – యీ విధంగా నమోదు చేశారు.

'నిజానికి వాతావరణ దృష్ట్యా ఇతర ప్రాంతాల కంటే, మదరాసునే నేను ఎన్నిక చేశాను. సంస్కృత సాహిత్యం, ఆర్షా తత్త్వ శాస్త్ర విజ్ఞానం ఈ రాష్ట్రంలో ఇతర భారత రాష్ట్రం కంటే ఎక్కువగా చెలామణిలో వున్నాయి. ఈ రాష్ట్రాలలో గ్రామ

[illegible]లోను విద్యాధికులు అయిన పండితులు వందల్లో వున్నారు. పాశ్చాత్య [illegible] యిక్కడ యింకా ఎక్కువ అపకారం చేయలేదు. బెంగాల్, బొంబాయి ప్రెసిడెన్సీలలో తెలాంగ్, భండార్కర్ నామాంకితులయిన పండితులు చాలామందే వున్నారు. అయితే పాండిత్య గరిమలో, ప్రాచీన ఆధ్యాత్మ విజ్ఞానాన్ని ఆకళింపు [illegible]లో తల్లాప్రగడ సుబ్బారావుకి దీటయినవారు నాకు ఎవరూ కనిపించలేదు'.

సుబ్బారావు దివ్యజ్ఞాన సమాజ వ్యవస్థాపకులను 23 ఏప్రిల్ 1882 ఉదయం 10.00 గంటలకు మదరాసు ఓడరేవులో కలుసుకున్నారు. స్వాగతం చెప్పారు. వారందరూ కలకత్తా నుంచి మదరాసుకు వచ్చారు. సత్కారాలు చేస్తూ, వారి నందరినీ సాయంత్రం నాలుగు గంటల వరకు ఓడరేవులోనే ఉంచి, ఆ తరువాత మేళతాళాలతో, బాజాభజంత్రీలతో నగరంలోని విడిదికి తోడ్కొని వచ్చారు సుబ్బారావుగారు.

వ్యవస్థాపకులు సుబ్బారావుని ఈ సంస్థలో సభ్యులుగా 25 ఏప్రియల్ 1882న చేర్చుకున్నారు. సభ్యత్వ స్వీకర్ ప్రక్రియ నలుగురితో పాటు కాక, ఏకాంతంగా, అతి రహస్యంగా జరిగింది, అని అల్కాట్ వివరిస్తూ 'అందుకు కారణం యేమిటో నాకూ వివరంగా తెలియదు. అగాధమయిన లోతులను తలపించే అద్భుతం అది!' అంటారు ఆయన.

మదరాసు ధియొసాఫికల్ సొసైటీ అనే పేరుతో ఒక శాఖను కల్నల్ ఆల్కాట్ నెలకొల్పారు. దానికి దివాన్ బహదూర్ ఆర్. రఘునాధరావు అధ్యక్షులు కాగా, సుబ్బారావు కార్యదర్శిగా ఎన్నికయినారు. ఈ శాఖ కార్యకలాపాలు ప్రథమంలో చాలా చురుకుగా ఉత్తేజకరంగా జరిగినాయి. కాని కాలక్రమేణ, పనిలో మందకొడితనం ప్రవేశించింది. సుబ్బారావు ఈ శాఖకు దరిమలా అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. కేంద్ర సంస్థ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వము, సొసైటీకి అవసరం అయిన న్యాయశాస్త్ర సలహాలు యివ్వడం, అనేక కమిటీలను ఆధ్వర్యం వహించడం... యిలా ఎన్నో కార్యకలాపాలు చేస్తూనే దివ్యజ్ఞానిక వ్యాసంగాలు కొనసాగించారు. పత్రికకు వ్యాసాలు రాయడం, పుస్తకాలు సమీక్షించడం, కొన్నాళ్లు ది ధియోసఫిస్ట్ (The Theosophist) పత్రిక సంపాదక బాధ్యత వహించడం కూడా చేశారు. ఆయనకు గ్రంథ రచనకు తీరిక, అవకాశం దొరికేది కాదు. వారు రాసిన వ్యాసాలన్నీ, ఎంతో బలవంతం మీద, తప్పనిసరి అయి రాసినవే తప్ప

తీరికూర్చుని తయారు చేసినవి కాదు. మాట్లాడడం, ఉపన్యాసాలు యివ్వడంలో మటుకు సుబ్బారావు ఎంతో దిట్ట. ఎన్నో క్లిష్టమయిన విషయాలను గురించి సరళంగా, అలవోకగా - మాట్లాడుతూపోయేవారట.

అటువంటి సుబ్బారావు అతి కొద్ది సంవత్సరాలు మాత్రమే జీవించి, 1890 జూన్ 24 తేదీన రాత్రి 10.00 గంటలకు పరమపదించారు. ఆ మధ్యాహ్నం 'నా గురువుగారు నన్ను పిలుస్తున్నారు. నేను చనిపోతాను - యింకా కొద్దిపాటి సమయములోనే. అంతవరకు తపశ్చర్యలో మునిగి వుంటాను. నన్ను ఎవరూ పలుకరించి భంగం కలుగజేయకుండా' అన్నారుట. అప్పటి నుంచి చివరిక్షణాల వరకు ఆయన నోరు తెరవలేదు. పెదవి విప్పలేదు. వారి మరణంతో భారత భావనకాశంలో ఒక ధృవతార మరుగుకు వెళ్లిపోయింది.

సుబ్బారావు రాసిన వ్యాసాలు, భగవద్గీత ఉపన్యాసాలు - ది థియాసఫిస్ట్ యితర పత్రికలలో ధారావాహికంగా వచ్చి తరువాత పుస్తకరూపం ధరించాయి. అనేక పునర్ముద్రణలు పొంది, యిప్పటికే సమావేశాలలో సభా ప్రాంగణాలలో చర్చనీయాంశాలు, అధికారిక ప్రస్తావనలుగా స్వీకరింపబడుతూ వుంటాయి. ఆయన అనుసరించిన ఆధ్యాత్మ సిద్ధాంతం 'తారక రాజయోగం' అనే పేరుతో భారతదేశంలో ప్రశస్తి పొందినది. ఈ సిద్ధాంత ప్రాతిపదికలు, దివ్యజ్ఞానసిద్ధాంత ప్రస్తావనలు సమన్వయం చేసుకుంటూ, వాటిలో వున్న విభేదాలు - వ్యత్యాసాలు కూడా విడమరచి చెబుతూ ఆయన తన ఉపన్యాసాలలో, వ్యాసాలలో తెలియచెప్పారు. ఆయన వ్రాసిన మొదటి వ్యాసం ది థియోసఫిస్ట్ పత్రికలో నవంబర్ 1881 సంచికలో ప్రచురణ అయింది. ఈ పత్రికను 1879లో బొంబాయి నగరంలో మేడం బ్లావట్స్కీ ప్రారంభించారు. అప్పటికే ఆమె ప్రథమ రచన గ్రంథం 'Isis Unveiled' (ప్రకృతి అనావరణం) అనేది భారతదేశంలో పండితులకు లభ్యం అయి, ప్రమోదం అందుకుంది. దీనిని ప్రస్తావిస్తూ సుబ్బారావు 1882లో బ్లావట్స్కీ రాసిన ఉత్తరంలో యిలా వ్రాశారు.

"మీరు కలకత్తా నుంచి మదరాసు రావడం చాలా అభిలాషణీయం అని నా మనవి. మిమ్మల్ని చూడవలెనని నేను చాలా కుతూహలంగా వున్నాను. ఈ మాట నిజమే అయినా ఆ కారణం చేతనే ఈ ఉత్తరం రాస్తున్నాననుకోకండి. ఇంతవరకు దివ్యజ్ఞాన సమాజశాఖ యిక్కడ ప్రారంభం కాకపోయినా, ఆ సమాజ ఆదర్శాలు, లక్ష్యాలు ఎరిగి ఆమోదించే వదాన్యులు యిక్కడ చాలామందే వున్నారు. మిమ్మల్ని చూడగలగడం వారందరికీ మహాభాగ్యం. పత్రికలలో వచ్చిన వార్తలు, సమీక్షలు తప్ప వారు కల్నల్ ఆల్కాట్‌ను గురించి కూడా యేమీ ఎరుగరు. మీ పుస్తకం 'అయిసిస్ అన్ వీల్డ్' వారి మనసుల మీద గాఢమయిన ముద్ర వేసింది. కల్నల్ ఆల్కాట్‌గారు ఈ నెలాఖరులో యిక్కడకు వస్తున్నారని నేను వారితో చెప్పాను. వారందరూ మిమ్మల్ని కూడా తప్పకుండా యిక్కడకు రమ్మని మరీ మరీ కోరుతూ నన్ను ఉత్తరం వ్రాయమని ప్రేరేపించారు. ఇక్కడ మిత్రులు ఆర్.రఘునాధరావును మీరు ఈసరికే 'థియోసఫీ'కి అనుయాయుడుగా చేయడంలో కృతకృత్యులు అయినారు. అందుకు నేను ఆనందిస్తున్నారు. ఆయన దృఢమయిన అభిప్రాయాలు వున్నవాడు. సత్యాన్వేషణపరుడు. థియాసఫీని బహుజన ప్రచారంలోనికి తీసుకురావడంలో ముందు ముందు బాగా ఉపకరించగలడు. అంతమాత్రమే కాదు ఇక్కడ కొందరు యూరోపియన్లు కూడా మిమ్ము చూడాలని కాంక్షిస్తున్నారు. అందుచేత మా కోరికను మన్నించి, మీరు కొన్నిరోజులు యిక్కడ ప్రవాసం చేయ వీలవుతుందేమో చూడండి-"

ఇంతకూ సుబ్బారావు వ్రాసిన మొదటి వ్యాసం పేరు 'ది ట్వెల్వ్ సైన్స్ ఆఫ్ జోడియాక్' (The Twelve signs of Zodiac) అనేది. జాతక చక్రంలో పన్నెండు రాశుల వివరణాంశాలు యిందులో పదిల పరచారు. ఇది వారి మొదటి వ్యాసమేకాక, అతి ప్రధానమయినది కూడా. విశ్వ నిర్మాణ సూచిక, మంత్ర తంత్ర శాస్త్రాల పరిచయం యిందులో ప్రముఖంగా కనిపిస్తాయి. వీరు యిక్కడ చెప్పిన అభిప్రాయాలను అనుసరించి మరింత లోతుగా పరిశోధన జరుగవలసిన అవసరం యిప్పటికీ అలాగే మిగిలి ఉంది. 'ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం, ఈ పరిశ్రమ అంతాయే దేశంలో ప్రారంభం అయిందన్న విషయాన్ని నిర్ధారించడం కాదు. ఈ విభజన (పన్నెండు రాశులుగా) వెనక ఉన్న తాత్త్విక విషయాలను వెలువరించడం, ఇంతవరకు బయటపడని అంతరార్థాలను వెదికి పట్టుకోవడానికి యేదయిన మార్గం ఉన్నదా అని పరిశీలించడం మటుకే. అనేక తాత్త్వికకథనాలు, మార్మిక వచనాలు గుర్తు తెచ్చుకున్నట్లయితే 'జాతక చక్రం' - దానిలోని రాశుల విభజన, ప్రాచీన భారతదేశంలోనే ప్రారంభమయిదన్న విషయం విదితం అవుతుంది' అంటారు ఈయన ప్రారంభంలోనే. ఆయన తన పరిశీలనలో ప్రధానంగా పెట్టుకున్న అంశాలు:

1. రాశుల పేర్లకు ఉపయోగించిన పదాలకు గల నానార్థాలను తెలుసుకోవడం, ఆ వివిధ అర్థాలను గణనలోనికి తీసుకోవడం.

2. ప్రాచీన తాంత్రిక గ్రంథాలలో యిచ్చిన అక్షరాలకు ప్రాతిపదికలయిన అంకెల విలువలను గుర్తించడం.

3. ఉపయోగించిన పదానికి సంబంధించిన ప్రాచీన గాథలు, సాంకేతిక వివరణలు ఏమయిన వుంటే వాటిని తెలుసుకోవడం.

4. ప్రతి పదంలోను విడివిడిగా వుండే సింబల్స్‌ను అటుయిటు సరిచూచుకుంటూ, కొత్త అర్థాల కల్పనకు అవకాశం వున్నదేమో గ్రహించడం... ఇలా కొన్ని మార్గాలు.

ఈ వ్యాసాన్ని సమీకరిస్తూ ఆయన యింకా అంటున్నారు.

'నేను చెప్పదలచుకున్న విషయాల వివరణ యింతటితో పూర్తి అయింది. సృష్టి నిర్మాణ క్రమాన్ని గురించి ప్రాచీనుల అభిప్రాయాలను, సిద్ధాంతాలను వివరించడం నా ఉద్దేశం కాదు. కాకపోతే - ఆ సిద్ధాంతాలకు జాతకచక్రంలో జరిగిన విభజనలకు మధ్య వున్న సంబంధాన్ని చూపడమే నా ఆశయం.

'ఈ రాశుల పేర్లు, చరిత్రలలో ఇమిడి వున్న తాత్త్విక సమన్వయాన్ని కొంతలో కొంత వెలుగులోను తీసుకురాగలిగాను. ప్రాచీనులు యీ విషయాలను పరమగోప్యంగా వుంచారు. మూల విషయాల మీద అద్భుతమయిన పొరలు, తెరలు విసిరి ఉంటారు. ఈ తెరలన్నింటికీ తొలగుట, మూల విషయాలను వేడుకగా, సామాన్యజనం ముందుకు - సరదా కోసం చదివే చదువరుల దృష్టికి తీసుకురావడం అసాధ్యం అయిన సంగతి.'

విశ్వనిర్మాణ చరిత్రను, దానిలోని మొదటి అధ్యాయాన్ని ఆయన యిలా సాంకేతికంగా క్రోడీకరించారు.

1. స్వయం సిద్ధమయిన శాశ్వత బ్రహ్మం.

2. ప్రణవం (ఓం)

3. బ్రహ్మాంకం - లైంగిక విభజన

4. ప్రణవంలోని నాలుగు మాత్రలు, నాలుగు అవస్థలు, బ్రహ్మ యొక్క నాలుగు ముఖాలు, పవిత్ర తారక

5. అయిదు గురు బ్రహ్మలు - అయిదుగురు బుద్ధులు, వీరందరూ కలిసి జీవాత్మగా ప్రాతినిధ్యం వహించడం.

6. అంతరిక్ష తేజస్సు (Astral Light) - కన్య పవిత్రత, ప్రకృతిలోని ఆరు శక్తులు.

7. అవిద్య నుంచి రూపాంతం పొందిన 36 తత్వాలు

8. భావ సంకల్ప విశ్వం - స్వప్నావస్థ - ఆత్మాశ్రయ కోణం నుంచి విశ్వాన్ని దర్శించడం.

9. తొమ్మిది మంది ప్రజాపతులు

10. Depoca Hedrun మనసులో రూపొందిన వస్తు పదార్థం విశ్వం.

11. పద్నాలుగు లోకాలు

12. అయిదు ప్రాథమిక మూలాలు (Elements)

'ఈ ప్రపంచ నిర్మాణం గురించిన చరిత్ర - ఆది నుంచి ప్రస్తుత స్థితి వరకు ఏడు అధ్యాయాలుగా కూర్పు అయింది. ఏడవ అధ్యాయం యింకా సంపూర్ణంగా లేదు' - అని వ్యాసాన్ని ముగింపు చేస్తారు.

సర్.యస్.సుబ్రహ్మణ్య అయ్యర్, సుబ్బారావును గురించి యిలా చెబుతున్నారు.

'ఆయన ఏ పుస్తకాన్నీ రెండు మూడుసార్లు చదవరు. ఏకసంతా గ్రాహి. [illegible] గ్రంథాలలోని శ్లోకాలను సందర్భానుసారంగా అలవోకగా వప్పజెప్పేవారు. అపారమయిన జ్ఞాపకశక్తి వారి సొత్తు. చదివేటప్పుడే విమర్శన దృష్టితో చదవడం వారి అలవాటు.

'ఒకమారు టెన్నిస్ ఆట అయిన మీదట, స్నేహితులతో వచ్చిన ప్రస్తావనలో "ఆత్మ స్వరూపం ఏమిటి?" అనే ప్రశ్న వచ్చింది. వెంటనే మాండూక్య ఉపనిషత్తు [illegible] భాగాలను వినిపించి ఆత్మస్వరూపాన్ని వర్ణించి చెప్పారు. వారికి ఆ మాండూక్య ఉపనిషత్' అంటే ఎక్కువ మక్కువ. చతుర్విధ కోశముల (Four Fold) వివరణ [illegible] ఉంది. ఈ ఉపనిషత్తుకు గెడపాదులు ఇచ్చిన కోరికలు సుబ్బారావుగారికి హృదయగతం. గెడపాదులతో సరితూగగల పాశ్చాత్య తత్త్వవేత్త ప్లేటో (Plato) [illegible] - అనేవారు మంత్రశాస్త్రం గురించి సూత్రప్రాయంగానే కాకుండా, [illegible]పూర్వకంగా ఉండే సంవిధానాలు వారికి ఎన్నో ఎన్నో తెలుసు'.

సర్.పి.యస్.శివస్వామి అయ్యర్ అనే సమకాలిక న్యాయవేత్త, జడ్జి ఆయన్ను గురించి యిట్లా అంటున్నారు :

'న్యాయవాదిగా ఆయన ఉన్నతిని ఎఱుకపరిచే ప్రయత్నం చేస్తాను. శ్రీ భాష్యం అయ్యంగార్ వలెనే సుబ్బారావుగారి జ్ఞాపకశక్తి అపారమయింది. నేను ఆయన వాదనలు ప్రత్యక్షంగా విన్నాను. నాలుగయిదు వందల కాగితాలున్న కోర్టు రికార్డును, ఆయన చేతిలో ఒక చిన్నకాగితం ముక్కయిన లేకుండా అనర్గళంగా సమీక్షించి వాదనలు సమకూర్చేవారు. విషయగ్రహణ శక్తి, సూటిగా, పదునుగా వాక్యాలలో అమరిక చేయడం, అలవోకగా మాట్లాడడం - ఆయన గొప్ప లక్షణాలు. వారి వాదనలు వినడం కర్ణపేయంగా, మనస్సుకు పన్నీరు చల్లినట్లుగా ఉండేది. మరింత ఆయుష్షే గనక వుండివుంటే, హైకోర్టులో ఉన్నత పదవులు ఆశ్రయించి న్యాయస్థానాలకు ఇతోధిక గౌరవ ప్రతిపత్తులను తీసుకువచ్చి వుండేవారు. ఆధ్యాత్మిక విషయాలు, థియసఫీ గురించి కార్యక్రమాలు ఆయనకు అధికం అయిపోయాయి. ద్వితీయ శ్రేణి న్యాయవాదులలో అత్యంత ప్రథమస్థానం వారిది. (బార్ - ఎట్ - లాలు ప్రథమశ్రేణి) ప్రత్యర్థి కక్షదారులు, న్యాయవాదులు ఆయన అంటే హడలిపోతూ వుండేవాళ్లు.

'వ్యక్తిగత జీవనంలో ఆయన అతి సరళ స్వభావుడు. ఆడంబరం లేనివాడు. ముక్కుకు సూటిగా వ్యవహరించే మనిషి. ఆయనతో మాట్లాడడం ఆహ్లాదకరంగా విజ్ఞానదాయకంగా వుండేది. విషయాలను తేజోవంతంగా ప్రదర్శించడంలో ఆయనకు ఆయనే సాటి. సామర్థ్యానికి, సమరసశీలతకు, వాగ్ధాటికి మూర్తికట్టినట్లుగా వుండేవారు.'

సుబ్బారావు మేనమామల యింట కాకినాడలో పుట్టారు. ఆయన జన్మించిన సంవత్సరంలోపుగానే తండ్రి చనిపోయినందువల్ల, ఆయన మాతమహుల మేనమామల సంరక్షణలో తల్లితోపాటు పెరిగారు. ఈయన మేనమామ దిగవల్లి వెంకట శివరావు, పిఠాపురం జమీందారు వద్ద దివాన్‌గా వుండేవారు. కాకినాడ హిందూకాలేజి విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయిన తరువాత, మదరాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఏ. చదివారు. పరీక్షలో మొదటి తరగతి విద్యార్థిగానే కాక 'మదరాసు యూనివర్సిటీ చరిత్రలోనే ఇంతవరకు ఎవరూ పొందనంత ఎక్కువ మార్కులు సంపాదించుకున్నారు.'

వీరికి 1876లో మేనమామ కూతురు సుందరమ్మగారితో వివాహం అయింది. తరువాత బరోడా హైకోర్టులో రిజిస్ట్రర్ ఉద్యోగంలో రెండు సంవత్సరాలు వున్నాడు. ఆపైన 1878-80లలో మదరాసు న్యాయవాద డిగ్రీపరీక్షకు చదివి, పరీక్షలో నాలుగవ ఉన్నతుడుగా నెగ్గారు. మెస్సర్స్‌గ్రాంట్ అండ్ లెంగ్ కంపెనీలో ఎప్రెంటిస్‌షిప్ అయినమీదట, మదరాసు హైకోర్టులో న్యాయవాదిగా నమోదు అయ్యారు. మరణించేవరకు, మదరాసులోనే వున్నారు. మేడమ్ బ్లావట్స్కీని చూచిన తరువాతనే (1882 నుంచి) ఆయన వేదాంత విషయాలను మాట్లాడడం మొదలుపెట్టారట. దాగా మరుగుపడిపోయిన ఆధ్యాత్మ విషయాలు, అనుభవాల సారం ఆయన ముందు విప్పివేసుకున్నారు. గత జన్మల స్ఫురణ, లోగడ ప్రోది చేసుకున్న జ్ఞానసంచయం ఆయన ముందు ద్వారాలు తెరుచుకున్నట్లుగా నిలిచాయి. ఆల్కాట్‌గారు నమోదు చేసిన వివరాల ప్రకారం 'కుటుంబ ప్రాపంచిక విషయాలలో ఆయన తమ తల్లిగారి దగ్గర పసిబిడ్డలాగ ప్రవర్తించేవాడు. ఆధ్యాత్మిక విషయాలలో మటుకు తల్లిగారి ముందు, బంధుమిత్రుల ముందు, కొద్దిపాటి పరిచయం వున్న వారి దగ్గర ఎంతో ఉదాసీనంగా, నిర్లిప్తంగా, అనాసక్తంగా ఉండిపోయేవారు. ఆధ్యాత్మ - గుప్త విషయాలు ఇతరులతో ప్రస్తావించక పోవటానికి కారణం - తమ గురువులకు అటువంటి వాగ్దానం చేసి వుండడమేనని చెబుతూ వుండేవారు.'

సుబ్బారావు వ్రాసిన అనేక వ్యాసాలలో ఆధ్యాత్య విద్యకు, గుప్త శాస్త్రాలకు సంబంధించిన అనేక విషయాలు, అందుకు అనుకూలమయిన వివరణలు వున్నాయి. లోతుపాతులు తెలుసుకోవాలనుకున్నవారికి యివి ఎంతగానో ఉపకరిస్తాయి. ముఖ్యంగా భగవద్గీతను గురించి వారు యిచ్చిన నాలుగు ఉపన్యాసాలు ఎన్నో విశేషాలను వెల్లడి చేస్తాయి. శ్రీకృష్ణుడు పరమాత్మగాను, సూర్య మండలానికి అధిపతి అయిన రూపంలోను, మామూలు మనిషిగాను - యిలా మూడు తరహాలలో యెంత ప్రగాఢమయిన విషయాలు వెల్లడి చేస్తాడో వివరంగా తెలియచెప్పుతారు. చివరి ఉపన్యాసంలో ఆయన యిచ్చిన ముక్తాయింపు శ్రద్ధగా గమనించవలసి వుంటుంది.

'ఈ ఉపన్యాసాలలో భగవద్గీత గురించి చదవడం ప్రారంభించాం మనం. అందుకే ఈ విషయం మీరు గమనించాలి. మన పుస్తకాలలో వున్న అమూల్య విషయాల వెలుగులో, మానసిక విజ్ఞాన శాస్త్రాల పుస్తకాల వెలుగులో - నేను ఈ ఉపన్యాసాలలో

ప్రతిపాదించిన విషయాలు యదార్థమా కాదా పరీక్షించడానికి ప్రయత్నించండి. ఈ ప్రతిపాదనలు భగవద్గీతలోని బోధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించండి. ఈ గ్రంథాన్ని గురించి అనేక వ్యాఖ్యానాలు వున్నాయి. అవన్నీ చదివి మనస్సును మరింత గందరగోళంలో పడవేసుకోకండి. మీ వివేకాన్ని అనుసరించి మీ అంతట మీరు సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు నా ప్రతిపాదనలు అర్థవంతం అయినవి అనిపిస్తే, ఆ దారిలో భగవద్గీత చదివి దాని పూర్తి తత్వాన్ని అవగాహన చేసుకోండి. మీ అంతట మీరు ప్రగాఢ చింతన చేసి ఆలోచించుకోండి. అనేక పుస్తకాలు చదవడం, ఎన్నో ఉపన్యాస విషయాలను మీరు స్వయంగా చింతన చేసి స్వంతం చేసుకుంటే తప్ప ఎన్ని ఉపన్యాసాలు విన్నా ఏమీ ప్రయోజనం లేదు. దివ్యజ్ఞాన సమాజం – ఎప్పుడో ఎవరో తయారుచేసిన తాత్త్విక భోజనాన్ని మీకు వడ్డించటానికి కాదు ఉన్నది. మీ అంతట మీరు ఎవరికి వారు చదువుకొని ఆలోచించుకొని నిర్ణయాలకు రావాలని సమాజం యొక్క ఆకాంక్ష. చదవండి, జ్ఞానాన్ని సంపాదించండి. మీరు సంపాదించిన దానిని మీ దేశ ప్రజలకు, వారి ప్రయోజనం కోసం, వినియోగించండి.

"మన ప్రాచీన పుస్తకాలలో ఉన్న తత్త్వశాస్త్ర విషయాలు ఎంతో అమూల్యమయినవి. అయితే అవన్నీ మూఢనమ్మకాలుగా రూపాంతరం పొందాయి. మన జ్ఞాన సంపద అంతా లుప్తం అయిపోతోంది. ఒకప్పుడు సజీవచేతనం (Living Faith) విశ్వాసంలా ఉన్న మతం ఇప్పుడు గుల్లలా తయారయి పోయింది. అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాలు ఎంతో విరూపం పొందాయి. బౌద్ధులు కూడా తమ మూల సూత్రాలకు విరూపాలు తగిలించారు."

"ఈ మత బోధనలను కృష్ణుని ప్రవచనాల వెలుగులో పరిశీలించగలిగితే, మనం హిందూ మతధర్మమును మరిచిపోయి దాని స్థానంలో ఏవో మూఢ విశ్వాసాలను, గుడ్డి నమ్మకాలను అనుసరిస్తూ జీవిస్తున్నామని సుబోధకం అవుతుంది. మన ప్రస్తుత నమ్మకాలు, నడవడి హిందూ రాజ్య సంక్షేమానికి పని చేయకపోగా దానిని దిగజారుస్తున్నాయి. దాని ఆధ్యాత్మ పుష్టిని బలహీన పరుస్తున్నాయి. ఈ దుస్థితికి రాజకీయ దుష్పరిణామాలు ఒక్కటే కారణం కాదని నేను నమ్ముతున్నాను."

"మన సమాజం' ఒకే ఒక రకమయిన ఆలోచనా విధానానికి పరిమితమై

నడిచే సంస్థ కాదు. అన్ని మతాల సారాంశాలను పరికిస్తాము. అలాగని వాటి పేరున ప్రచారంలో వున్న అస్తవ్యస్త విధానాలను అనుసరించము. అన్నిటినీ సమీకరించి, అన్ని మత విశ్వాసాలకు అంతర్లీనంగా ఉన్న 'సామాన్య భూమిక'ను తిరిగి చేపట్టటానికి ప్రయత్నిస్తున్నాము. మన దేశ ప్రజలందరినీ మతశాస్త్ర ప్రాతిపదికపై పునరుజ్జీవింపజేయటానికి కృషి చేయడం, సభ్యులందరి కర్తవ్యం. వారిని అతి స్వచ్ఛమైన, పవిత్రమైన విశ్వాసాలవయిపు మళ్లించవలసి వుంది. అటువంటి విశ్వాసం గతకాలంలో ఉండేది. ఇప్పుడది నామమాత్రమే అయిపోయి, మరుగుపడిపోయిన గ్రంథాలలోనే ఉండిపోయింది."

సుబ్బారావుగారు 'తారక రాజయోగ' సూత్రాలను, సిద్ధాంతాలను అనుసరించి తమ తాత్త్విక దర్శనాన్ని నిర్మాణం చేశారు.

తారక రాజయోగం వేదాంత తత్త్వదర్శనానికి కేంద్ర స్థానం. హృదయ స్థానంలో వున్నదని వారు చెబుతారు. (Ancient Wisdom Religion) ప్రాచీన / సనాతన జ్ఞానదర్శనంలో బహు ప్రధానమైన భాగం ఇదే – అంటారు. మూలమయిన 'రాజయోగం'లోనే ఆచరణ శీలతకు అన్వయక్రమానికి దోహదం చేసేది తారక రాజయోగం. దీనిని సూచనగా మాత్రమే వెలిబుచ్చారు సుబ్బారావుగారు. ఆధ్యాత్మ విద్యలో దానికి వున్న కేంద్ర స్థానాన్ని అందరూ గమనించవలసిన విషయంగా వారు వక్కాణిస్తారు.